# పుస్తకాలు అమ్మేవాడు

ఆ పుస్తకాలమ్మేవాడు రామవరప్పాడు స్టేషన్లో మా బండి ఎక్కాడు. బండి కదలగానే, ఒక మూల నిలబడి ఒక పుస్తకం తీసి "యం. ఏ. లు ప్యాసయినవారు" అని పాడటం మొదలు పెట్టాడు. ఆ పాడే ధోరణిలో ఒక వింత ఆకర్షణవుంది. మా పెట్టె క్షణంలో నిశ్శబ్ద పూరితమైంది. ఆ నిశ్శబ్దంలో ఖంగున వినిపించే వాని కంఠధ్వని ఎవర్ని ఆకర్షించదు? నేను విననట్లు నటిస్తూ సావధానంగా వింటున్నాను.

"చెట్ల క్రింద ప్లీడర్లు
గట్లమీద ప్లీడర్లు
కల్లబొల్లి మాటలాయె
ఇల్లు వల్లు గుల్లలాయె!"

అని సాగించాడు. ఆపాట సారాంశం యిది. ప్లీడరు పరీక్ష చదివి, ఇల్లుగుల్లచేసి, ఎవ్వరింటికైనా చెక్కా కొడతారు. ఇంటిదగ్గర 'భార్యాలలామ' పోరు పడలేక కోర్టుకి వెళ్తారు. అక్కడ 'బారురూము' లో పడి నిద్రపోతారు, సాయంకాలం అయిదింటికి అపసోపాలు పడుతూ కొంపకి చేరతారు. "మా ఆయన కష్టపడి వొచ్చారమ్మా!" అని భార్య ఆదరిస్తుంది....ఇంటి కామందు అద్దె అడిగితే, "ఆరునెల్ల నోటీసు ఇవ్వ లేదు. నేను ఖాళీచేయను. ఏమిచేసుకుంటావో చేసుకో" అంటారు. చేతిలో పిడ్డవాళ్ళను పిల్చి పిప్పిచేస్తారు. తిరుక్షవరం చేసి పంపుతారు.... ఫ్యాషన్లకు మాత్రం తక్కువ ఉండదు. నోటిలో సిగరెట్లు, వ్రక్కా క్రాపింగులు మధ్య సాపట్లు...."

రైలు పెట్టెలోని జనమంతా నన్ను చూచి గొల్లున నవ్వారు. నా

నోటిలో సిగరెట్టూ, నా మధ్యపాపటి, (బహుశా నా మొహం ప్లీడరు మొహంగా ఉందేమో) నా మొహం దేవురించింది. "అక్లయింటు వెధవ చేశాడు, డబ్బు లేదని మూడోక్లాసు టిక్కెట్టు కొన్నాడు. లేకపోతే నా తాతలనాడు ఎక్కారా, నా తండ్రులనాడు ఎక్కారా, ఈ మూడో తరగతి!" అని గొణుగుకొన్నాను. గబగబా కాగితాలు తీసుకొని ఏదో చదువుతున్నట్లు నటించాను.

పుస్తకాలమ్మేవాడు పాడుతూనే వున్నాడు. వాని మాటలు చెవుల్లో గింగురుమంటున్నవి. నా అదృష్టవశాత్తువాడు ప్లీడర్ల అధ్యాయం ముగించి స్త్రీల అధ్యాయంలోకి వచ్చాడు. నేను కాగితాలు అడ్డుపెట్టుకునే వింటున్నాను.

"చంక చేతుల జాకెట్లు
చంటిమెడల జాకెట్లు
ముక్కుపుడకలు మోటాయె
వాలుమాపులు మెండాయె"

నేను ఆకర్షించబడ్డాను. అప్రయత్నంగా కాగితాలు మడిచి శ్రద్ధగా విన్నాను. ఈ అధ్యాయం సారాంశంకూడా చెబుతాను కుచద్వయం కనుపించే చేతులుగల జాకెట్లు—ఒక కుచం కనుపించేటట్లుగా రెండో కుచం మీదనుంచి పోయేపమిట...."

పెట్టెలోని జనమంతా సంతోషంతో విరగబడి నవ్వారు. కొందరు చిరునవ్వులతో గుసగుస లాడుకున్నారు. కొందరు "చూడు" అన్నట్లు కనుసైగలు చేసుకున్నారు. "బలే బాగుంది. అందులో ఒక్క అబద్ధం లేదు" అన్నారుకొందరు. ఒక ముసలివాడు తన్మయత్వంలో తలూపుతూ పుస్తకాలమ్మేవాడి పాటకు తాళం వేశాడు. "నాకొక పుస్తకం, నాకొక పుస్తకం" అని ఆ పుస్తకాలన్నీ క్షణంలో కొనివేశారు. నా ప్రక్కన కూర్చున్న హరిజన బాలిక భర్తతో, "ఒక పుస్తకం కొను. పిచ్చాయి కూడా చదువుకుంటాడు" అన్నది. అతను రెండు పుస్తకాలు కొన్నాడు.

నాకూకూడా ఒక పుస్తకం కొనాలనిపించింది. కాని నేను (ప్లీడర్ని, ఆర్టిస్టుని) ఈ అర్ధణా పుస్తకం-ఇటువంటి పుస్తకం కొంటుంటే ఎవ్వరైనా చూస్తే?.... (వచ్చేటప్పుడు వీడు ఒంటరిగా కనబడితే తప్పకుండా కొనా అని నిశ్చయించుకున్నాను.)

ఇంతలో నేను దిగిపోవలసిన స్టేషన్ వచ్చింది. ఆ స్తకం సంగతే ఆలోచిస్తూ దిగాను. నావెంటనే, నేనుదిగిన పెట్టెలోనుంచే ఇరవై సంవత్సరాల యువతీ దిగింది. "ఈమె ఇందాకనుంచీ ఈ పెట్టెలోనే ఉందా!" అని నేను ప్రశ్నించుకున్నాను. ఆమె దబదబా నాదగ్గరకు వచ్చింది.

"ఆ పుస్తకం కొనుక్కోరూ?"

"ఏ పుస్తకం!"

"రైలుపెట్టెలో అమ్మిన పుస్తకం."

"నాకెందుకు?"

"చాటుగా చదువుకొని ఆనందించటానికి. ఇందాక వాడు చదివేటప్పుడు, అం రూ పరిహాసంగా నన్ను చూచి నవ్వేటప్పుడు, మీరు నోరు తెరుచుకొని ఆనందించారుగా" అంది. వాడు వర్ణించిన స్త్రీ వేషం ఈమెకు సరిగ్గా అతికిపోయిందని అప్పుడు నేను గ్రహించాను. రైలులో జనము అంతగా ఎందుకు సంతోషించారో అప్పుడు నాకు అర్థము అయింది! పాపం, ఈ అమ్మాయి....

"అభిమానం లేకపోతేసరి, ఒక స్త్రీని పట్టుకొని అందులో భారత స్త్రీని, ఈ విధంగా ఇంతమంది పురుషులు పరిహసిస్తుంటే, నోరు తెరుచుకొని సంతోషించారు."

"నేనేం చెయ్యను? నన్నుమాత్రం వాడు పరిహసించలేదా? మొదటి అధ్యాయమంతా నా జాతిని గురించేకదా! నేను ప్లీడర్ని!"

"ఓహో, మీరు ప్లీడర్లా!!.... అందుకనే మిమ్మల్ని పరిహసించినా మీ దేశంలోని వొక స్త్రీని పరిహసించినా గుటకలు మింగుతూ సంతోషించారు. ఏ తృణమో, పణమో వంకాయో, సొరకాయో, ముట్టజెపితే నా తరపున వాగేవారు కాబోలు!.... ప్లీడర్లు!" అనుకుంటూ వెళ్ళిపోయింది.

నాకు ఆశ్చర్యం వేసింది. పరిహసించటం, తప్పయితే ఎవ్వరిని పరిహసించినా తప్పే, 'పురుషుణ్ని ఏమిచేసినా పరవాలేదుగాని స్త్రీని జాగ్రత్తగా వాడాలి' అనే వాదం నేను ఒప్పుకోను.

"అందులో నీ దేశం, అబలను" ఈ జాతీయవాదం నన్ను ఎప్పుడూ ఆకర్షించలేదు. నన్ను ఒక్కటే ప్రశ్న బాధిస్తోంది. "ప్లీడర్లంటే ఇంత ఏవగింపు ఎందుకు? ఈమె నన్ను డబాయించే బదులు (ప్లీడర్ని లోకువా) వాణ్నే యెందుకు డబాయించరు?"